




# కరపత్రం

SINCE 2014

సోమవారం డిసెంబర్ 16 2024 | సంపుటి :0 | సంచిక : 68 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# భూమిలేని పేదలకు శుభవార్త..

## ఈనెల 28 నుంచి అమల్లోకి మరో పథకం

**భూమిలేని పేద కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది.**

» నిరుపేద కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని ఈనెల 28 నుంచి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

»ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు.



2లో..

దేశ స్వాతంత్ర్యం కోసం ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం రోజు డిసెంబరు 28న నిరుపేద కూలీలకు మొదటి విడత డబ్బులు రూ.6వేలు ఇస్తామని ప్రకటించారు. వచ్చే సంక్రాంతి నుంచి రైతులకు రైతు భరోసా డబ్బులు అందజేస్తామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి, రైతుల కోసం నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి భారాస రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు భ్రమలు కలిగించి ప్రజలను మోసం చేయడమే భారాస నాయకులకు తెలుసన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల విస్తరణకోసం ప్రజా ప్రభుత్వం కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేయనుందని వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా మూసీని అభివృద్ధి చేయడానికి మూసీ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టామన్నారు.

అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్

అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్ ఏర్పాటు చేస్తాం. ఔటర్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్‌రోడ్ మధ్య ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందించబోతున్నాం. రాష్ట్ర అప్పులపై భారాస నాయకులు పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస పాలకులు ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆసుపత్రులు, ఉద్యోగుల జీపీఎఫ్, మిడ్ డే మీల్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు రూ.40,154 కోట్లు. పదేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భారాస ప్రభుత్వం రూ.7,11,911 కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపింది.

## డిప్యూటీ సీఎం పవన్‌ను ఆహ్వానించిన పీవీ సింధు



హైదరాబాద్: తన వివాహానికి రావాల్సిందిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆహ్వానించింది. ఆదివారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను తండ్రి రమణతో కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసింది. ఈ నెల 22న వెంకట దత్త సాయిని సింధు పెళ్లి చేసుకోబోతున్నారు. మరోవైపు కాబోయే ఈ దంపతులు అత్యంత సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే.

## సంధ్య థియేటర్ ఘటనలో గాయపడిన బాలుడిని పరామర్శించిన మందకృష్ణ

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో గాయపడిన బాలుడు శ్రీతేజను పరామర్శించేందుకు ఇప్పటి వరకు సినీ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రాకపోవడం శోచనీయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు.

2లో..

## రేవంత్ సర్కారు ఆదేశాలను ధిక్కరించి.. ఉద్యమ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు కవిత భూమిపూజ

» రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని సర్కారు జారీ చేసిన గెజిట్‌ను, ఆదేశాలను ధిక్కరించి జగిత్యాల పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భూమిపూజ చేశారు.



2లో..


# రాజ్యాంగాన్ని భాజపా ధ్వంసం చేస్తోంది: బీవీ రాఘవులు




హైదరాబాద్: భారతీయులు విశ్వమానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగింది మన రాజ్యాంగమేనని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. దానిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు అక్షయ కుమార్‌దత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి రాఘవులు ప్రధాన వక్తగా పాల్గొన్నారు. “ రాజ్యాంగంపై పార్లమెంటులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో భాజపా, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, భాజపా రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోంది. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్ షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చింది. ఒకే దేశం-ఒకే ఎన్నిక కూడా నియంతృత్వానికి దారి తీస్తుంది. రాజ్యాంగ లక్ష్యాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య వాదం, సామాజిక న్యాయం, సామ్యవాదాన్ని కాపాడాలి” అని రాఘవులు పేర్కొన్నారు.

# పాట ఉన్నంత కాలం

## గద్దర్ సజీవంగా ఉంటరు : హరీశ్‌రావు




చాలా సామాన్య పదాలతో ప్రజల హృదయాలల్లోకి చేరే విధంగా గద్దరన్న పాటలు ఉంటాయన్నారు. గద్దరన్న భౌతికంగా మన మధ్య లేకపోయిన పాట ఉన్నన్ని రోజులు గద్దరన్న సజీవంగానే ఉంటారని.. పొడుస్తున్న పొద్దుమీద పాట తెలంగాణ ఉద్యమాన్ని, సమాజాన్ని ఉర్రుతలూగించి ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. 2008లో తెలంగాణ కోసం రాజీనామా చేసిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎంపీలపై తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి అభ్యర్థులను పెట్టాలని నిర్ణయిస్తే అది తప్పని వాదించిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు అండగా గద్దర్ నిలబడ్డారనన్నారు. తూప్రాన్‌లో నీళ్లులేవు, హల్దీ వాగులో నుంచి వాటిక చెరువుకి లిఫ్ట్ పెట్టాలని గద్దర్ కోరితే ఎనిమిది నెలల్లోనే పూర్తి చేసి.. ఆయనతోనే ప్రారంభించామన్నారు. తెలంగాణ వచ్చాక జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదని గద్దర్ లేఖ రాస్తే వారికి వెంటనే ఒక్క సంతకంతో జీతాలు కేసీఆర్ పెంచారని.. అది గద్దర్‌కు కేసీఆర్ ఇచ్చిన గౌరవమన్నారు. సిద్దిపేటలో గద్దరన్న విగ్రహం పెట్టడం మాకు చాలా గౌరవమని.. పెట్టించే బాధ్యత నాది అంటూ హామీ ఇచ్చారు.

»పాట ఉన్నంత కాలం గద్దర్ సజీవంగా ఉంటారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు.

»గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో గద్దర్ రచనల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

»కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరై మాట్లాడుతూ.. గద్దర్ అన్నది అర్ధ శతాబ్దపు పోరాటమన్నారు.

»పదవులకోసం ఆశ పడకుండా తన తండ్రి పోరాటాన్ని, చరిత్రను రేపటి భావి తరానికి అందించడానికి మంచి ప్రయత్నాన్ని సూర్యం తీసుకున్నారని అభినందించారు.

»దశాబ్దాల్లో జరిగిన ప్రతి పోరాటంలో గద్దరన్న ఉన్నారన్నారు.

»విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత ఉద్యమం ప్రతి దాంట్లో న్యాయం వైపున నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించారన్నారు.

»మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్నను కలిసే అదృష్టం కలిగిందని.. వంద ఉపన్యాసాల సారం గద్దరన్న ఒక్క పాట ద్వారా చెబుతారన్నారు.

2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం డిసెంబర్ 16 2024

# సంపాదకీయం

## చంద్రబాబు: నాడు, నేడు, రేపు!

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయింది. ఉద్యోగుల విషయంలో వారి పనితీరును మదింపు చేసేందుకు ఆరు నెలల కాలాన్ని ప్రొబేషనరీ పిరియడ్‌గా పరిగణిస్తారు. పనితీరు సంతృప్తికరంగా ఉంటేనే సర్వీసు క్రమబద్ధీకరిస్తారు. నాయకులకు ఈ సూత్రం వర్తించదు. ఎందుకంటే వారు ఎప్పటికప్పుడు ప్రజల మనసు గెలుచుకుంటూనే ఉండాలి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు నెలల పనితీరును సమీక్షించుకుందాం! గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనితీరు, వ్యవహార శైలి పట్ల విరక్తి చెందిన ప్రజలు కూటమికి భారీ మెజారిటీ కట్టబెట్టారు. ప్రతిపక్ష నాయకుడి హెూదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని కూడా ప్రజలు జగన్‌కు ఇవ్వలేదు. అయినప్పటికీ జగన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడు కాకుండా పోరు. ఈ కారణంగా ముఖ్యమంత్రితో పాటు ప్రతిపక్ష నాయకుడి పాత్రను కూడా సమీక్షించుకోవడం సముచితంగా ఉంటుంది. తనకు ప్రతిపక్ష నాయకుడి హెూదా ఇస్తే తప్ప శాసనసభ సమావేశాలకు హాజరు కాబోనని ప్రకటించిన జగన్‌రెడ్డి శాసనసభను బహిష్కరిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోయినవారు ఓటమికి కారణాలను సమీక్షించుకొని ప్రజాభిమానాన్ని తిరిగి చూరగొనడానికి ప్రయత్నించడం %–% మెజారిటీ సాధించినవాళ్లు తమ పని తీరుతో ప్రజల మనసు మళ్లీ గెలుచుకొనే ప్రయత్నం చేయడం సహజం. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకొనే బదులు ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. తన అతి మంచితనం, అతి నిజాయితీ వల్లే ఎన్నికల్లో ఓడిపోయామని ఆయన ఆత్మవంచన చేసుకుంటున్నారు. మచ్చుకైనా తనలో కనిపించని సుగుణాలను ఆపాదించుకొనే ప్రయత్నం చేయడం విడ్డూరంగా కూడా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు గడవక ముందే ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందని జగన్ తనను తాను వంచించుకొనే ప్రయత్నాలు మొదలెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఆరు నెలల పాలన పూర్తయిన సందర్భంగా జగన్‌రెడ్డికి చెందిన రోత పత్రికలో ఒక కథనాన్ని వండి వార్చారు. ఈ కథనం ప్రకారం… "ఈ ఆరు నెలల్లో హత్యలు, దాడులతో రాష్ట్రం అల్లకల్లోలమైంది. ఆగని హత్యాచారాలతో మహిళా లోకం భీతిల్లుతోంది. అధికార వ్యవస్థపై ప్రభుత్వం కక్ష గట్టడంతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రెడ్ బుక్ బాధితులయ్యారు. ఏడు వేలకు పైగా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. శాంతి భద్రతలు మృగ్యం అవడంతో సామాన్యుల జీవితం ఛిద్రమైంది" అని చెప్పుకొచ్చారు. నిజానికి ఈ దారుణాలన్నీ జగన్ పాలనలోనే జరిగాయన్నది నిర్వివాదాంశం. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా పోయిందని అప్పుడు హైకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ హక్కులను కాలరాశారు. కొంత మంది పోలీసు అధికారులను కిరాయి సైనికులుగా మార్చుకొని జగన్‌రెడ్డిని ఎదిరించిన వారిపై కేసులు పెట్టి వేధించారు. ఎంపీ రఘురామకృష్ణ రాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను చెరబట్టారు. నిస్సహాయ స్థితిలోకి నెట్టివేయబడిన ప్రజలు ఈ అరాచకాలను ఎన్నికల వరకు మౌనంగా భరించి ఎన్నికల్లో మాడు పగిలేలా తీర్పు ఇచ్చారు. ఒక ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో నిరూపించిన జగన్‌రెడ్డికి ఇప్పుడు చంద్రబాబు పాలనలో, తన హయాంలో జరిగిన అక్రమాలు, అరాచకాలు అన్నీ జరుగుతున్నట్టుగా కనిపిస్తున్నాయట! అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే ప్రజా ఉద్యమాలకు పిలుపు ఇచ్చారు. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద రైతు ధర్నాలకు పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో జగన్‌రెడ్డి ఊహించుకుంటున్నంత వ్యతిరేకత లేనందున రైతు ధర్నాలు పేలవంగా జరిగాయి. వైసీపీ నాయకులు సైతం అప్పుడే ఉద్యమాలు ఏమిటి? అని విసుక్కున్నారు. కొంత మంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వదిలి వెళ్లిపోతున్నారు. నిజంగానే చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారనే అనుకున్నా జగన్‌రెడ్డి ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలంటే మరో నాలుగున్నరేళ్లు ఆగాల్సిందే. ఎందుకంటే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఐదేళ్లు భరించారు కదా! ఇదీ వైరుధ్యం…విచిత్రమేమిటంటే, చంద్రబాబు పాలన అరాచకంగా ఉందని జగన్‌రెడ్డి భావిస్తూ ఉండగా, చంద్రబాబు మెతక వైఖరి వీడాలని తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు భావిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కొంత మంది వైసీపీ నాయకులు తాము ఇంకా అధికారంలోనే ఉన్నామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మరికొంత మంది తెలుగుదేశం పార్టీకి దగ్గరై తమ అరాచకాలను కొనసాగిస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల ఆగ్రహానికి ఇది కూడా ఒక కారణం. 'చంద్రబాబు నాయుడు బతికుంటే 2029 తర్వాత మేము అధికారంలోకి వచ్చి ఆయనను జైల్లో పెడతాం' అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా నోరు పారేసుకున్నారు. మనిషి లక్షణాలు ఉన్నవారు ఎవరూ… 'బతికుంటే' అన్న మాట వాడరు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని కూడా జీవించాలని కోరుకుంటాం.

## రేవంత్ సర్కారు ఆదేశాలను ధిక్కరించి.. ద్యమ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు కవిత భూమిపూజ

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి వచ్చిన కవితకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహ భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని జీవోలు, గెజిట్‌లు జారీ చేసినా ఉద్యమ తెలంగాణ తల్లినే తాము ప్రతిష్ఠించుకుంటామని తేల్చిచెప్పారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఉద్యమకాలంలో తెలంగాణ తల్లి తమకు స్ఫూర్తిని ఇచ్చిందని.. ధైర్యాన్ని నింపిందని తెలిపారు. ఉద్యమ తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మను కాపాడుకొని విశ్వమంతా వ్యాపింపజేస్తామని తెలిపారు. తెలంగాణ అస్థిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని గ్రామ గ్రామాన ఎండగడుతామని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని ప్రకటించారు.

సారంగాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలను కవిత సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ముచ్చటించి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కస్తూర్బా పాఠశాలలకు పెంచిన డైట్‌చార్జీలను ప్రభుత్వం వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 472 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నారన్నారు. పెంచిన డైట్ చార్జీలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా విద్యార్థినులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని, ఈ విషయంపై రాజీ పడవద్దని ప్రభుత్వానికి సూచించారు. సర్వశిక్ష అభియాన్ పథకం కింద పనిచేస్తున్న వారితో పాటు కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను రెగ్యులరైజ్ చేస్తానని గతంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో జూనియర్ కాలేజీని మంజూరు చేయాలని స్థానికులు కోరారని, దాంతో అప్పటి సీఎం కేసీఆర్ జూనియర్ కాలేజీని మంజూరు చేశారని,



త్వరలో అది ప్రారంభమవుతుందని చెప్పారు. కేసీఆర్ ఏ లక్ష్యంతో అయితే గురుకుల పాఠశాలల పెట్టారో ఆ లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా ఈ ప్రభుత్వం వ్యవరించిందని, దానికి ప్రతిచర్యగా బీఆర్ఎస్ ఉద్యమిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాల వల్ల ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచడం, నూతన డైట్ మెనూను విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంపై విలేకరులు అడిగిన కవిత స్పందించారు. సంజయ్ పార్టీ మారినా కూడా ప్రజలు కేసీఆర్‌తో బీఆర్ఎస్ పార్టీతో ఉన్నారని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వచ్చి జగిత్యాలలో ప్రచారం చేసినా కూడా బీఆర్ఎస్ అభ్యర్థి అయిన సంజయ్ కుమార్‌ను ప్రజలు గెలిపించారని, అంటే ఇది సంజయ్ వ్యక్తిగత గెలుపు కాదని, కేసీఆర్ గెలుపుగా చూడాలని సూచించారు. నాయకులు పార్టీ మారినంత మాత్రానా బీఆర్ఎస్ పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు పటిష్టంగా ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో గులాబీ జెండాను ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ .. సభ ముందుకు రెండు బిల్లులు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో పర్యాటక విధానంపై సోమవారం స్వల్పకాలిక చర్చ జరగనుంది. ఈనెల 9న మొదలైన సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. సోమవారం నుంచి సమావేశాలు తిరిగి కొనసాగనున్నాయి. సమావేశాలు ఎప్పటి వరకు కొనసాగించాలన్నది బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే.. ఇటీవల మృతి చెంది మాజీ ఎమ్మెల్యేలకు సభ సంతాపం తెలపనుంది. అనంతరం ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగుతుంది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ–2024 బిల్లు, తెలంగాణ యూనివర్సిటీల అమెండ్‌మెంట్ బిల్లు–2024ను సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశ పెడతారు.




## భారత్‌లో అక్రమ చొరబాట్లు.. కేంద్రానిదే బాధ్యత: ఆతిశీ

బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లపై కేంద్రమే బాధ్యత వహించాలని ఢిల్లీ సీఎం ఆతిశీ అన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు.

ఢిల్లీ: భారత్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తున్న రోహింగ్యాలు వారి పునరావాసాలపై ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్రమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అక్రమ చొరబాట్లకు కేంద్రమే బాధ్యత వహించాలన్నారు.

"నిత్యం బంగ్లాదేశ్ నుంచి వేల సంఖ్యలో అక్రమచొరబాట్లు జరుగుతున్నట్టు ఇటీవల ఓ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. వారు సరిహద్దును ఎలా దాటుతున్నారో తెలిపింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశ సరిహద్దులను రక్షించడంలో విఫలమైన తీరుకు ఇది



అద్దం పడుతోంది. అంతేకాకుండా రోహింగ్యాలకు ఢిల్లీలో పునరావాసంతో పాటు తగిన వసతులు కల్పించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది" అని ఆతిశీ లేఖలో పేర్కొన్నారు.

ఇదే విషయంపై ఇటీవల ఆప్ జాతీయ కన్వీనర్ కేంద్రంపై నిప్పులు చెరిగారు. ఆయన ఆరోపణలపై స్పందించిన భాజపా.. ఎన్నికల్లో రోహింగ్యాలను ఓటు బ్యాంకుగా మార్చేందుకు ఆప్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. కేజ్రీవాల్‌పై చేసిన ఆరోపణలపై తాజాగా స్పందించిన ఆతిశీ లేఖలో ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా.. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ అభ్యర్థుల తుది జాబితా విడుదల చేసింది.

జమిలి ఎన్నికల బిల్లులపై పునరాలోచనలో కేంద్రం..!

మొత్తం 70 స్థానాలు కలిగిన ఢిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు ఇప్పటికే ఆప్ మూడు జాబితాలను ప్రకటించగా.. తాజాగా 38మంది అభ్యర్థులతో తుది జాబితాను విడుదల చేసింది. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా.. సీఎం ఆతిశీ మరోసారి కాల్కాజీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునేందుకు లేదని ఇప్పటికే ఆప్ స్పష్టం చేసింది.

## జమిలి ఎన్నికల బిల్లులపై పునరాలోచనలో కేంద్రం..!

ఢిల్లీ: జమిలి ఎన్నికల బిల్లుల పై కేంద్రం పునరాలోచనలో పడినట్లు కనిపిస్తోంది. తాజాగా లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి రెండు బిల్లులను తొలగించారు. తొలుత ఈ నెల 16న లోక్‌సభ ముందుకు బిల్లులు తీసుకురావడానికి కేంద్రం సిద్ధమైంది. ఆమేరకు లోక్‌సభ బిజినెస్ జాబితాలో కూడా పొందుపరిచారు. కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ బిల్లు పెడతారని కేంద్రం పేర్కొంది. కానీ.. తాజాగా రివైజ్డ్ చేసిన లోక్‌సభ బిజినెస్‌లో జమిలి ఎన్నికల బిల్లులు లేవు. ఈ నెల 20తో పార్లమెంటు సమావేశాలు ముగియనున్నాయి. తాజా పరిణామాలు నేపథ్యంలో.. శుక్రవారంతో ముగిసే శీతాకాల సమావేశాల్లో బిల్లులు పెట్టడంపై సందిగ్ధత నెలకొంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు జమిలి ఎన్నికల అమలు కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణాన్ని చేర్చాల్సి ఉంటుంది. పార్లమెంటు పదవీ కాలంలో మార్పు కోసం..అధికరణం 83ని, అసెంబ్లీల పదవీ కాలం సవరణకు..అధికరణం 172ని, ఎన్నికల నిబంధనల రూపకల్పన కోసం పార్లమెంటుకు అధికారం కల్పించే.. అధికరణం 327ని సవరించాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్ర మంత్రిమండలి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులకు ఈ నెల 12న ఆమోదం తెలిపింది.

## భూమిలేని పేదలకు శుభవార్త..

### ఈనెల 28 నుంచి అమల్లోకి మరో పథకం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు 2014 నాటికి ఏడాదికి చెల్లించాల్సిన అప్పు రూ.6,400 కోట్లు ఉండగా, పదేళ్లలో భారాస చేసిన అప్పుల వల్ల ఏడాదికి రూ.66,782 కోట్లు చెల్లించే దుస్థితికి భారాస తీసుకెళ్లింది. సన్నాలపై క్వింటాకు ఇస్తున్న రూ.500 బోనస్ ద్వారా ప్రతి ఏకరాకు రూ.10వేల నుంచి 15వేల వరకు అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోంది. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి రైతులకు నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చుచేసింది" అని భట్టి విక్రమార్క వివరించారు.

## పాట ఉన్నంత కాలం

### గద్దర్ సజీవంగా ఉంటరు : హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

గద్దరన్న జీవిత చరిత్ర పైన ఒక డాక్యుమెంటరీ తీస్తే తాను సహకారం అందిస్తానన్నారు. స్వతంత్రం వచ్చి ఇన్ని ఏళ్లు అవుతున్నా ఇంకా సమాజంలో అసమానతలు ఉన్నాయన్నారు. అవి చెరిపేయాలంటే గద్దరన్న ఆలోచలు ముందుకు తీసుకోవాలన్నారు. ఎప్పటి వరకైతే ప్రభుత్వం ప్రజల ఆలోచలను తీసుకవెళ్లదో, అణిచివేత ఉంటదో అక్కడ ప్రభుత్వ అవార్డులకు అర్థం లేదనే మాట ఆ రోజు గద్దర్ చెప్పారని.. నేడు నందిని సిధారెడ్డి తిరస్కరించి చూపించారన్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణ తల్లి చేతిలో బతుమ్మను మాయం చేసిన రేవంత్ రెడ్డి అవార్డు ఇస్తే తృణప్రాయంగా తిరస్కరించిన నందిని సిధారెడ్డి అని.. ఆయన మన సిద్ధిపేట బిడ్డ కావడం నిజంగా గర్వకారణమన్నారు. త్వరలోనే గద్దర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని ఒక భారీ బహిరంగ సభను సిద్దిపేటలో నిర్వహించుకుందామన్నారు.

## సంధ్య థియేటర్ ఘటనలో గాయపడిన బాలుడిని పరామర్శించిన మందకృష్ణ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో గాయపడిన బాలుడు శ్రీతేజను పరామర్శించేందుకు ఇప్పటి వరకు సినీ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రాకపోవడం శోచనీయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను మందకృష్ణ పరామర్శించి.. బాలుడికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

అల్లు అర్జున్.. బాధిత కుటుంబానికి రూ.కోటి అందించడంతో పాటు శ్రీతేజ, అతని సోదరికి చదువుకు అయ్యే ఖర్చులు భరించాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో విఫలమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'మా' అసోసియేషన్‌తో పాటు సినీ ప్రముఖులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

## రాజ్యాంగాన్ని భాజపా ధ్వంసం చేస్తోంది: బీవీ రాఘవులు

మొదటిపేజీ తరువాయి

పెట్టుబడిదారీ సమాజంలో అసమానతలు పెరిగాయని ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల వ్యతిరేకత, సామ్యవాద భావనకు మద్దతు పెరుగుతోందని రాఘవులు తెలిపారు. అంతకుముందు దత్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిఐటీయూ ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, టీఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి. మాణిక్ రెడ్డి, ఎం. నరహరి, సి. కమల కుమారి, రాష్ట్ర నాయకులు సింహాచలం, కొండలరావు, పౌరస్పందన వేదిక కార్యదర్శి రాధేశ్యామ్, పద్మశ్రీ, టీఎస్ యుటీఎఫ్ జిల్లాల నాయకులు పలువురు ఉపాధ్యాయులు, దత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తొలి పర్యటన.. భారత్‌కు చేరుకున్న శ్రీలంక అధ్యక్షుడు

ఢిల్లీ: మూడు రోజుల పర్యటనలో భాగంగా శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే భారత్ చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న ఆయనకు కేంద్ర సహాయ మంత్రి మురుగన్ స్వాగతం పలికారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్న ఆయనకు సాదర స్వాగతం పలికినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు.

భారత్‌లో మూడు రోజుల పాటు (డిసెంబరు 15–17 వరకు) అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే పర్యటన కొనసాగనుంది. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం మనదేశంలో చేపట్టిన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదే. శ్రీలంక విదేశాంగ మంత్రి విజితా హెరాత్‌తోపాటు మరో మంత్రి అనిల్ జయంత ఫెర్నాండో కూడా ఉన్నారు.

తొలుత భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో దిసనాయకే సమావేశం కానున్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటి కానున్నారు. ప్రధానంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు సముద్ర భద్రతా సహకారానికి సంబంధించిన అంశాలు కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది.

# డిసెంబర్ 17న ఆశ వర్కర్స్ బస్సు యాత్ర ను జయప్రదం చేయండి



– సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి

**కరపత్రం : ధర్మారం డిసెంబర్ 14:**
డిసెంబర్ 17 న ఆశ వర్కర్లు చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని పెద్దపల్లి జిల్లా సిఐటియు గౌరవ అధ్యక్షురాలు జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా నంది మేడారం లో ఆశ కార్యకర్తలతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం 18 వేళా వేతనం నిర్ణయించాలని పిఎఫ్ ,ఈఎస్ఐ ,ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని ,పని బారం తగ్గించాలని తదితర డిమాండ్స్ సాధనకై తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న పెద్దపల్లి జిల్లా కేంద్రానికి బస్సు యాత్ర వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పెద్దపల్లి జిల్లా కమిటీ పిలుపునిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (%ఎ్ఙబ%)జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.జ్యోతి మాట్లాడుతూ :బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు 18 వేళా వేతనం నిర్ణయించాలని,వారికి సౌకర్యం , ఉద్యోగ భద్రత కల్పించాలని పని భారం తగ్గించాలని ప్రభుత్వన్ని కోరిన స్పందించకపోవడంతోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందని జాబ్ చార్ట్ కూడా లేదని సర్వేలు చేంజ్ చేయిస్తున్నప్పటికీ ఎటువంటి పారితోషకం చెల్లించడం లేదని అన్నారు. మరో పోరాటానికి ఆశ వర్కర్లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు సామంతుల స్వప్న,మంజుల,సుజాత,సంధ్య,రజిత,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి.

**కరపత్రం న్యూస్ : గన్నేరువరం 15**



మండలంలోని రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి వద్ద ఉదయం ఏడు గంటలకు ప్రధాన రహదారిని దాటుతున్న ఓ వ్యక్తిని హైదరాబాదు నుండి కరీంనగర్ వెళ్తున్న టాటా సుమో గోల్డ్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం అతనిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించ గా అతడు మృతి చెందినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు. మృతుని ఊరు పేరు తెలియదని సుమారు 30 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని ఫోటో ఆధారంగా ఇతనిని ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ గ్రూప్-2 పరీక్షలు ప్రారంభం



– పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్, అదంపు కలెక్టర్లు

**కరపత్రం సంగారెడ్డి ప్రతినిధి:**
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని సెంటెంతోని, పయనీర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా క్రాంతి వల్లూరు, ఎమ్మెన్నార్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో 41 పరీక్ష కేంద్రంలో 15218, మంది అభ్యర్థులకు గాను పేపర్ 1 పరీక్షకు 7359 మంది హాజరు కాగా7859 మంది గైర్హాజరు అయ్యారు. పేపర్ 2 పరీక్షకు 7206 మంది పరీక్షకు హాజరు కాగా 8012 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఆదివారం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 48 శాతం మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 42 శాతం మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. పేపర్ 2(రెండవ సెషన్) పరీక్షకు 47.4 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయ్యారని అధికారులు తెలిపారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి వెల్లడించారు.

# సిపిఐ శత జయంతోత్సవాలను విజయవంతం చేయండి

– రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ పోటీ
– సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి

**కరపత్రం రామగుండం డిసెంబర్, 15:**
భారత కమ్యూనిస్టు పార్టీ రామగుండం నగర సమితి జనరల్ బాడీ సమావేశం ఆదివారం స్థానిక భాస్కరరావు భవన్లో సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కమ్యూనిజాన్ని ఆదరిస్తున్నారని అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావడమే తార్కానమని వారన్నారు. డిసెంబర్ 26న సిపిఐ పార్టీ 100 సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంగా వాడవాడనా గ్రామ గ్రామాన వంద వసంతాల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 100 సంవత్సరాల చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని రైతులు కార్మికులు కర్షకులు విద్యార్థులు యువకులు మహిళలకు సంబంధించిన అనేక హక్కులు



సాధించడంలో కమ్యూనిస్టు పార్టీ పోరాటం ఏనలేనిదని కొనియాడారు. యూపీఏ వన్ ప్రభుత్వంలో చేరడం ద్వారా ఉపాధి హామీ పథకంతో పాటు అనేక ప్రగతిశీల పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. నేడు కేంద్రంలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలకు తహతలాడుతున్నారని భారత దేశంలో ప్రజలకు పన్నుల భారాన్ని మోపుతూ నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి పెట్రోల్ గ్యాస్ లాంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా ఒక్కో వస్తువుకు ఒక్కోరకమైన పనులు విధిస్తూ ఒకే దేశం ఒకే ఎన్నిక దేనికోసం అని ప్రశ్నించారు. రాబోయే కాలం అంతా ఎన్నికల కాలమని స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ మండల ఎన్నికలు జరుగుతాయి గనుక భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ రేపు రాబోయే రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచి కౌన్సిల్లో అడుగు పెట్టాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సహాయ కార్యదర్శి గోశిక మోహన్ మాజీ జిల్లా కార్యదర్శి గౌతమ్ గోవర్ధన్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లా గౌడ్ కేంద్ర కార్యదర్శి కే స్వామి ఆర్.జీ.1 కార్యదర్శి ఆరెల్లి పోషం నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఒదెమ్మ ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కన్నం లక్ష్మీనారాయణ సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తో పాటు 200 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది ప్రజానాట్యమండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, వై.లేనిన్ ,మొండి, డప్పు రాజు, ఆసాల రమ విప్లవ గేయాలు ఆలపించడం జరిగింది

# తెలంగాణ లో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నాం

– పెద్దపెల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయ్యన్న గారి భూమన్న

**కరపత్రం రామగుండం డిసెంబర్, 15:**
తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నామని పెద్దపల్లి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయ్యన్న గారి భూమన్న అన్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీ బిజెపి కార్యాలయంలో పార్టీ ఎన్నికల సన్నాక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధి గా హాజరైన భూమన్న, సహాయ ఎన్నికల అధికారి క్యాతం వెంకటరమణ లు మాట్లాడుతూ పార్టీ పునాదుల పటిష్టతకు పోలింగ్ బూత్ కమిటీలు ఆధారమని అన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లో 31 మంది సభ్యులతో కమిటీలు వేయనున్నామని పేర్కొన్నారు . రామగుండం




అసెంబ్లీలో బిజెపి అత్యధిక సభ్యత్వం నమోదు చేసిందని 259 పోలింగ్ బూతులకు గాను 150 పోలింగ్ బూత్ లలో 100 కు పైగా సభ్యత్వం నమోదు చేయగా 100 పోలింగ్ బూత్ లో 50 కి పైగా సభ్యులను పార్టీలో చేర్చుకోవడం జరిగిందని వివరించారు. మిస్డ్ కాల్ సభ్యత్వంతో కలిపి 27వేల మందిని పార్టీలో చేర్చుకోవడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రతి పోలింగ్ బూత్ లో 31 మంది సభ్యులతో కమిటీలు వేయనున్నామని తెలిపారు. వీరందరితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం చేయనున్నామని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రభారి ఆర్మూల్ల పోచం, నియోజకవర్గ ఇన్చార్జి కందుల సంధ్యారాణి పోచం, నాయకులు మెరుగు హనుమంత గౌడ్, గుండెబోయిన లక్ష్మణ్, సుల్వ లక్ష్మీ నరసయ్య, భూమయ్య, అయితే పవన్, అందే రాజ్ కుమార్, అపర్ణ, పద్మ, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగం

– ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కరపత్రం : ధర్మారం డిసెంబర్ 15:**
ప్రతి ఒక్కరి ఆత్మరక్షనకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలోని ఫంక్షన్ హాల్లో డ్రాగన్ స్వార్డ్ కుంగ్ -పూ అకాడమీ ఇన్స్ట్రక్టర్ లింగంపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల లక్షేటీపేట్ లో నిర్వహించిన



రాష్ట్ర స్థాయి కుంగ్ పూ టోర్నమెంట్ లో పథకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి వారికి ప్రశంస పత్రాలతో పాటు బెల్టుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ : ప్రతి ఒక్కరి ఆత్మరక్షణ కు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ఇక్కడ ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారిని అభినందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్-పూ అకాడమీ ఫౌండర్ రాజమల్లు,జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్,మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్,వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు కొత్త నర్సింహులు, అజయ్, పొలుదాసరి సంతోష్,తిరుపతి, మోటపలుకుల అశోక్, లచ్చయ్య,బత్తిని రవి గౌడ్,ఆవుల మల్లయ్య తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి దీక్షాపరులకు మార్గదర్శి జనార్ధన గురుస్వామి

-రామగుండం మాజీ శాసనసభ్యులు బి.ఆర్.ఎస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కోరు కంటి చందర్

**కరపత్రం రామగుండం డిసెంబర్, 15:**
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అయ్యప్ప స్వామి వారిదీక్షాపరులకు జనార్ధన్ గురుస్వామి మార్గదర్శకులు అని రామగుండం మాజీ శాసనసభ్యులు బి.ఆర్.ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరు కంటి చందర్ అన్నారు. కే జే , జనార్ధన్ గురుస్వామి పదవ వర్ధంతి సందర్భంగా అదివారం గోదావరిఖని శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో జనార్ధన్



గురుస్వామి 2025 ఫోటో క్యాలెండర్ను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనార్ధనాన్ గురుస్వామి తమ జీవితాన్ని అయ్యప్పస్వామి వారి సేవకే అంకితం చేశారని, వారిని అయ్యప్పస్వామి దీక్షపరులు ఆదర్శంగా తీసుకొవాలన్నారు. ఈ కార్యక్రమం లో అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ గుమ్మడి కుమారస్వామి, ధర్మశాస్త్ర నిత్య అన్నదాన వేదిక వ్యవస్థాపకుడు కౌటం బాబు గురుస్వామి దేవాలయం గురుస్వామి హనుమంతరావు, చల్లా రవీందర్ రెడ్డి సురేష్ రాకేశ్ ఆలయ అర్చకులు రామకృష్ణ పాల్గొన్నారు

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం డిసెంబర్ 16 2024

## మల్లారెడ్డిపల్లి లో ఉచిత వైద్య శిబిరం..

**– ఆదిత్య సేవా అభ్యుదయ ఆర్ఎంపి ల అసోసియేషన్ వీణవంక.**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 15.**




ఆదిత్య సేవా అభ్యుదయ ఆర్ఎంపి పి.ఎం.పి వీణవంక మండల అసోసియేషన్.. ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీణవంక ఎస్సై తోట తిరుపతి విచ్చేసి , ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులకు, వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి ఆర్.ఎం.పి పిఎంపి యూనియన్ అధ్యక్షులు కంకణాల శ్యాంసుందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్క అంజిబాబు గౌడ్,రాజేష్, గ్రామీణ వైద్యులు, రోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా పోతరవేన సతీష్ యాదవ్ ఎన్నిక...

**– ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు..**

**కరపత్రం ప్రతినిధి,వీణవంక, డిసెంబర్ 15.**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎలక్షన్లో భాగంగా, వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామ బీసీ ముద్దుబిడ్డ పోతరవేన సతీష్ కుమార్ మండల ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం యూత్ నాయకులను ఉద్దేశించి ప్రణవ్ బాబు మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీలో మండలంలో యూత్ లో చురుగ్గా పనిచేసే కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన మీ యూత్ ద్వారానే గ్రామంలో గడపగడపకు మన పథకాలను తీసుకువెళ్లాలని అలాగే రాబోయే మండల బాడీ ఎలక్షన్లో చురుగ్గా పాల్గొని యువతకే అవకాశం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్,ఉపాధ్యక్షులు ధర్మముల శ్రీకాంత్,మద్దుల ప్రశాంత్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లస్మక్క పల్లి అభివృద్ధి కోసం ప్రణవ్ బాబు కు వినతిపత్రం అందజేత..

**– గ్రామ యువ నాయకులు మద్దుల ప్రశాంత్ పటేల్..**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 15.**



వీణవంక మండలం లస్మక్కపల్లి గ్రామంలో త్రాగునీరు కోసమే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు డ్రైనేజీల సమస్య ఉందని, పనులు త్వరగా పూర్తి చేయాలని, గ్రామ యువ నాయకులు మద్దుల ప్రశాంత్ పటేల్ ఆదివారం హుజురాబాద్ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు ని మర్యాదపూర్వకంగా కలుసుకొని, గ్రామ అభివృద్ధికి సహకరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మద్దుల ప్రశాంత్, నర్సింగాపూర్ యువ నాయకులు పోతరవేన సతీష్ కుమార్,కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొదటిరోజు ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 2 పరీక్ష

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 15**







తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. మండల కేంద్రంలోని జేఎన్టీయూలో ఆదివారం ఉదయం 932మంది అభ్యర్థులకు 492 మంది హాజరు కాగా 440 మంది గైర్హాజరయ్యారు. ముగ్గురు అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరు కాకపోవడంతో లోపలికి అనుమతించలేదు . అనంతరం మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 932 మందికి 489 హాజరయ్యారని, 443 మంది హాజరు కాలేదని కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. ఏడుగురు అంగవైకల్య అభ్యర్థుల పరీక్షను సహాయకులతో వ్రాయించినట్లు వెల్లడించారు. జేఎన్టీయూ వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా మంథని సీఐ బి.రాజు, రామగిరి ఎస్సై చంద్రకుమార్ బందోబస్తు నిర్వహించారు.

# రణవీర్ & శ్రేయస్ స్పోర్ట్స్ స్టూడియో లో టైక్వాండో బెల్ట్ అవార్డు కార్యక్రమం

**కరపత్రం దినపత్రిక, మల్కాజిగిరి మండల ప్రతినిధి.**



కౌకూర్ లోని రణవీర్ & శ్రేయస్ స్పోర్ట్స్ స్టూడియోలో గ్రాండ్ మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో రణవీర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు బెల్ట్ మరియు సర్టిఫికేట్ లను అందుకున్నారు. ఇటీవల జరిగిన తైక్వాండో బెల్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెల్ట్ మరియు సర్టిఫికేట్ లను గ్రాండ్ మాస్టర్ రమేష్ చేతుల మీదుగా అందజేయబడ్డాయి. అవ్ని – యెల్లో,ధ్రువ–యెల్లో 1, మాన్య – గ్రీన్, షనయ – గ్రీన్, ఆర్నా – యెల్లో 1, ప్రహర్ష్ – గ్రీన్, హిమేష్ – బ్లూ, కుశల్ – బ్లూ, భవిక – గ్రీన్, వరేన్య – గ్రీన్, ప్రియాంష్ – గ్రీన్ బెల్టులను అందుకన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ రమేష్ మాట్లాడుతూ ఇప్పుడున్న సమాజంలో ప్రతి ఒక్కరు తైక్వాండో నేర్చుకోవాలని, కౌకూర్ లో రణవీర్ & శ్రేయస్ స్పోర్ట్స్ స్టూడియోను ప్రారంభించినందుకు చాలా మంచి రెస్పాన్స్ వస్తుందని తెలిపారు. అలాగే స్పోర్ట్స్ స్టూడియోలో తైక్వాండో, కరాటే, డాన్స్, యోగా, జుంబా ఫిట్నెస్ బ్యాచ్లు కూడా ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు 8885551847 కి సంప్రదించవచ్చనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



# హిసామోద్దిన్ సేవలు పలువురికి ఆదర్శం..

**– సీఎం కప్ క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ..**

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 15**







కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ

మహమ్మద్ హిసామోద్దిన్ సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తాయని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ హిసామో ద్దీన్ సేవలను ఆదివారం కొనియాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకర పట్నం మండలం కేశవపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాకారులకు సొంత ఖర్చులతో యూత్ కాంగ్రెస్ శంకరపట్నం మాజీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు సేవా భావంతో సీఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు టీ షర్టులను అందజేశారు. ఈ మండల అధ్యక్షుడు బసవయ్య గౌడ్ మాట్లాడుతూ సీఎం కప్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు సొంత ఖర్చులతో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు హిసామోద్దిన్ సొంత ఖర్చులతో క్రీడాకారులకు టీ షర్ట్ లను అందజేయడం అభినందనీయమని ఆయన సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బండారి తిరుపతి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు మొహమ్మద్ షారుక్, కేశవపట్నం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొలంగూరి సదానందం, మహమ్మద్ చాంద్ పాషా, వోంగోజు సంపత్, కొత్తపల్లి రవి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూమిలో అక్రమ షెడ్డు నిర్మాణం

- **మరో ఇంటి నంబర్తో విద్యుత్ కనెక్షన్ పొందిన వైనం....**
- **అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న విద్యుత్ అధికారులు**
- **హైకోర్టు స్టే ఆర్డర్ ను సైతం లెక్క చేయడం లేదు....**
- **భూ యజమాని విజ్ఞప్తులను సైతం పట్టించుకోని వైనం...**



**కరపత్రం కరీంనగర్ జిల్లా 15 డిసెంబర్**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కొత్తపల్లి గ్రామంలో ఇక్కడ గొట్టె.ప్రేమావతి అనే మహిళకు సర్వే నంబర్ 467 లో రెండు గంటల భూమి కలదు. ఈ భూమికి సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయి.. అయితే ఈ భూమిపై కన్నేసిన పల్లపు ఉమా, పల్లపు తిరుపతి, గుంచ్కరి ప్రకాష్, గుంచ్కరి పూజిత అనే వ్యక్తులు భూ యజమాని లేని సమయంలో ఆ స్థలంలో ఒక రేకుల షెడ్డు అర్ధరాత్రి పూట నిర్మాణం చేశారు. ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు కానీ పత్రాలు కానీ లేవు, విషయం తెలుసుకున్న భూ యజమాని వారికి సంబంధించిన భూమి ఇతర వ్యక్తులకు అన్యాక్రాంతం అయిందని తమకు న్యాయం చేయాలని కోరుతూ సంబంధిత పోలీసు స్టేషన్లో, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగినది.కానీ ఎలాంటి న్యాయం జరగకపోవడంతో ఉన్నత న్యాయస్థానం అయిన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం జరిగినది, దీనిపై విచారించిన న్యాయస్థానం భూ యజమానికి స్టే ఆర్డర్ ఇవ్వడం జరిగినది. ఇది ఇలా ఉండగా విద్యుత్ శాఖ అధికారులు అక్రమ నిర్మాణ షెడ్డు కు విద్యుత్ మీటర్ బిగించడం జరిగినది, ఆక్రమణదారులు వేరే ఇంటి నంబరను క్రోడీకరిస్తూ విద్యుత్ కనెక్షన్ దరఖాస్తు చేసుకున్నారు, ఈ దరఖాస్తు ఆధారంగా విద్యుత్ అధికారులు కనెక్షన్ జారీ చేయడం జరిగినది. దీనిపైన మండల రెవెన్యూ అధికారులు మరియు మున్సిపాలిటీ అధికారులు సమగ్ర విచారణ చేసి అట్టి నిర్మాణం తొలగించవలెనని భూ యజమాని కోరుతున్నారు.

# రాజ్యసభ సభ్యులు (ఎంపీ)గా టైగర్ ఆర్ కృష్ణయ్య ఏకగ్రీవం!

**– భాజాపా కు కృతజ్ఞతలు తెలిపిన**
**– జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్....**

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 15.....**



జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు టైగర్ ఆర్ కృష్ణయ్య రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనా సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ కురుమ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి బీసీ కుల సంఘాలు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి విద్యారంగంలో రాజకీయ రంగంలో ఎన్నో మార్పులు చేర్పుల కోసం పోరాటం చేసి స్కాలర్షిప్ కోసం హాస్టళ్ల కోసం బీసీలకు గురుకుల పాఠశాలలు కోసం అదేవిధంగా రాజకీయంగా బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ కొరకై మరియు విద్యార్థుల స్కాలర్షిప్ కొరకు ఎన్నో ఉద్యమాలు చేసి బీసీలకు అండ ఉండి ఏ ప్రభుత్వం వచ్చినా నిలదీసి అడిగి బీసీల తరపున పోరాటాలు చేసి బీసీ విద్యార్థులు విద్యాపరంగా ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నారంటే అది టైగర్ కృష్ణయ్య పోరాట ఫలితమే. జాతీయస్థాయిలో ఎన్నో ఉద్యమాలు. పోరాటాలు. చేసిన ఉద్యమ సూర్యుడు 50 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటలు చేసి సెంట్రల్ లో కులఘణన చేపట్టి బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పోరాడుతున్న టైగర్ ఆర్ కృష్ణయ్య కి భారతీయ జనతా పార్టీ తరపున ఏకగ్రీవంగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక చేసినందుకుగాను ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీకి మరియు తెలుగుదేశం పార్టీకి జనసేన పార్టీకి తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపినారు

## రోడ్డు ప్రమాదంలో కార్మికునికి గాయాలు



**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 15**

మండలంలోని సెంటినారి కాలనీకి చెందిన సాగర్ అనే సింగరేణి కార్మికుడు ఆదివారం ఉదయం ఏ ఎల్ పి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఏలిపిలో జనరల్ మజ్దూర్గా పనిచేసే సాగర్ విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా చెట్టును ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదం జరిగిన సమయంలో చీకటి ఉండగా సాగర్ ను ఎవరు గమనించకపోవడంతో మూడు గంటల పాటు ఆలస్యంగా ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం అతను ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.